## క్లుప్తంగా

### వాహన తనిఖీల్లో రూ. లక్ష స్వాధీనం

ప్రత్తిపాడు: వాహన తనిఖీల్లో భాగంగా ఫ్లైయింగ్ స్క్వాడ్ టీం రూ. లక్ష స్వాధీనం చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. ప్రత్తిపాడు ఎస్ఐ వి.సోమేశ్వరరావు తెలిపిన ప్రకారం.. పల్నాడు జిల్లా నరసరావుపేట మల్లయ్య సెంటరుకు చెందిన ఆతుకూరి ప్రసాద్ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా, ఎటువంటి రశీదులు లేకుండా తన కారులో రూ.లక్ష తీసుకువెళుతున్నాడు. అదే సమయంలో ప్రత్తిపాడు మండలం, నడింపాలెం 16వ నంబరు జాతీయ రహదారిపైనున్న అంతర్ జిల్లా పోలీస్ చెక్ పోస్టు వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు కారులో నగదును గుర్తించారు. ఈ మేరకు నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుంటూరు రూరల్: నగర శివారుల్లోని బుడంపాడు నారాకోడూరు మధ్యనున్న రుచి ధాబా వద్ద రోడ్డు పక్కన గుర్తు తెలియని వ్యక్తి స్పృహ తప్పిపడిపోయి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన బుధవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం సుమారు 55 సంవత్సరాల వయస్సుగల వ్యక్తి రోడ్డు పక్కన స్పృహ కోల్పోయి పడి ఉన్నాడని సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని అతనిని 108లో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారన్నారు. చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడన్నారు. ఆచూకీ తెలిసిన వారు 8688831378, 8688831376 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

### క్షయ వ్యాధిని నిర్లక్ష్యం చేయొద్దు



గుంటూరు ఎడ్యుకేషన్: క్షయ వ్యాధిని నిర్లక్ష్యం చేయకుండా చికిత్స తీసుకోవాలని ఎన్నారై హాస్పిటల్స్ పల్మనాలజీ విభాగాధిపతి డాక్టర్ ఆర్. రామకృష్ణ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఫార్మసీ ప్రాక్టీసు విభాగ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న డాక్టర్ రామకృష్ణ క్షయ వ్యాధి వ్యాప్తి, లక్షణాలు, నిర్ధారణ పరీక్షలు, చికిత్సా విధానాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. క్షయ, ఎయిడ్స్, క్షయతో పాటు మూత్ర పిండాల సమస్యలు ఉన్న వారు చికిత్సకు తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని వివరించారు. కొన్ని రకాల క్షయ వ్యాధికి అందుబాటులో ఉన్న చికిత్సా విధానాలపై మాట్లాడారు.డయాబెటిస్, హైపర్ టెన్షన్ వంటి వ్యాధులకు జాతీయస్థాయిలో వ్యాధి నివారణ, నిర్మూలన కార్యక్రమాల్ని నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన పెంపొందించడం ద్వారా చికిత్స సులభతరం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ కె. రవికుమార్, ఫార్మాడీ డైరెక్టర్ పి. సీతారామయ్య, ఫార్మా ప్రాక్టీసు విభాగాధిపతి ఎస్. హేమ కుమారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### మహిళా సాధికారత ఉద్యమాలకు ఆద్యుడు పూలే



ఏఎన్‌యూ: దేశంలో మహిళా సాధికారిత ఉద్యమాలకు ఆద్యుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని ఢిల్లీ యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు ఐ.తిరుమాలై అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మహాత్మా జ్యోతిరావు పూలే అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం జ్యోతిరావు పూలే జయంతి ముందస్తు వేడుకలు నిర్వహించారు. యూనివర్సిటీ అధికారులు, సిబ్బంది, పరిశోధకులు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతరం జరిగిన సదస్సులో ఆచార్య తిరుమాలై కీలకోపన్యాసం చేస్తూ అట్టడుగు వర్గాలు ఒక్కటైతే అది దేశం అవుతుందని, ఆ వర్గాలు సాంస్కృతికంగా ఒక్కటైతే సమానత్వం వస్తుందని అవి జరిగితేనే మన దేశం అనే భావన అన్ని వర్గాలకు కలుగుతుందనే సత్యాన్ని పూలే విశ్వసించారన్నారు. వీసీ ఆచార్య పి.రాజశేఖర్ మాట్లాడారు. ఏఎన్‌యూ పూలే అధ్యయన కేంద్రం కో-ఆర్డినేటర్ ఆచార్య త్రిమూర్తిరావు అధ్యయన కేంద్రం నివేదికను సమర్పించారు. పూలే అధ్యయన కేంద్రం ప్రోగ్రామర్ కోటి యాదవ్, పలువురు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**24 నుంచి 26 వరకు నాక్‌బృందం పర్యటన**

ఏఎన్‌యూ: నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) పీర్ కమిటీ ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పర్యటించే తేదీలు ఖరారయ్యాయి. యూనివర్సిటీలో బుధవారం వర్సిటీ అధికారులు, అధ్యాపకులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో వీసీ ఆచార్య పి.రాజశేఖర్ నాక్ బృందం పర్యటన వివరాలు వెల్లడించారు. నాక్ బృందం ఈనెల 24, 25, 26 తేదీలలో ఏఎన్‌యూలో పర్యటిస్తుందని ఈ ఈ మేరకు నాక్ కార్యాలయం నుంచి వర్సిటీకి అధికారిక సమాచారం వచ్చిందని వీసీ తెలిపారు.

# జనమంతా జగనన్న వెంటే

- సంక్షేమ పథకాల కొనసాగింపు సీఎం జగన్‌తోనే సాధ్యం
- పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ
- తక్కెళ్లపాడు, ఉప్పలపాడులో ఎన్నికల ప్రచారం



ఉప్పలపాడు బహిరంగసభలో మాట్లాడుతున్న పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: రాష్ట్ర ప్రజలంతా జగనన్న వెంటే ఉన్నారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో తాను వేసే ప్రతి అడుగూ ప్రజాసేవకోసమేనని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అన్నారు. పెదకాకాని మండలం తక్కెళ్లపాడు, ఉప్పలపాడు గ్రామాల్లో బుధవారం విస్తృత పర్యటన చేశారు. రామాలయం, చర్చి, మసీదుల్లో పూజలు, ప్రార్థనలు చేసి ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. వృద్ధులు, మహిళలను, ప్రజలను పలుకరిస్తూ ముందుకు కదిలారు. ఉప్పలపాడు గ్రామంలో రాత్రి జరిగిన బహిరంగసభకు చాగంటి మురళీమోహన్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మీ బిడ్డల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలన్నా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు మంచి జరగాలన్నా మళ్లీ వైఎస్సార్ సీపీకే పట్టం కట్టాలన్నారు. రాజకీయాల్లోకి రాకముందే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆదర్శంగా తీసుకుని భజరంగ్ ఫౌండేషన్‌ను స్థాపించి ఉచితంగా వైద్య సేవలు అందించడం జరిగిందన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు మీ ముందుకు వచ్చి ఓటు అభ్యర్థిస్తున్నానన్నారు. ప్రాణం ఉన్నంత



ఆటో నడుపుతున్న అంబటి మురళీకృష్ణ

వరకూ నియోజకవర్గం నుంచి రాగి పైసా కూడా ఆశించకుండా నిజాయతీగా పరిపాలన కొనసాగించడంతో పాటు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గర్వించేలా పనిచేస్తానన్నారు. ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్న ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం గ్రామాలకు తాగునీరు సరఫరా చేసిన ఘనత వైఎస్సార్ సీపీకి దక్కిందన్నారు. ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కామినేని శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, ఎంపీటీసీ సభ్యురాలు దంతాల శివపార్వతి, శివాలయం చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, శివాబత్తుని దయానంద్, ముద్రబోయిన నాగేశ్వరరావు, పల్లెంపాటి శ్రీనివాసరావు, మాదా రాధా, డాక్టర్ గోచిపాతల శ్రీనివాసరావు, సయ్యద్ సుభాని, కాకాని మల్లేశ్వరరావు, కూడిపూడి నాగరాజు, పెదబ్రహ్మయ్య, గైడు, మేరిగ సుబ్బారావు, పెనుమాల అరుణ్‌కుమార్, షేక్ ఖాసిం, అప్పసాని చంద్రశేఖర్, కిలారి రాజా రమేష్, కిషోర్, బాబు, బండి మరియమ్మ, కగ్గా శివయ్య, పెరుమాళ్ళ అనిల్‌కుమార్, బండ్లమూడి భానుకిరణ్, బెంజిమెన్, ఫ్రాన్సిస్, పలువురు వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## వైభవం.. ప్రతిష్టా మహోత్సవం

- కొమ్ముడప్పుల నృత్యాల నడుమ ఘనంగా అంకమ్మతల్లి గ్రామోత్సవం
- అన్ని ఆలయాల జలప్రసాదంతో శాస్త్రోక్తంగా జలాధీశం



ప్రతిష్టా మహోత్సవాలలో భాగంగా అంకమ్మతల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

ప్రత్తిపాడు: వేద మంత్రోచ్చారణలతో ప్రత్తిపాడు మార్మోగిపోతుంది. అంకమ్మతల్లి దేవాలయ ప్రతిష్టా మహోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం 9.05 నిమిషాలకు సుముహూర్తాన బాలాలయం నుంచి వెలుపలకు అంకమ్మతల్లిని ఆహ్వానించారు. పది గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఆలయ ఆవరణలో విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, రక్షాబంధనం, వాస్తుపూజ, అగ్నిమథనం, అగ్నిస్థాపన హోమం, యంత్ర నమస్కారాలు, మంత్రం జపనుష్టమలు, యజ్ఞశాల ప్రవేశం, అఖండస్థాపన, మృత్యం గ్రహణం, అంకురార్పణం శాస్త్రోక్తంగా జరిపించారు.

**గ్రామోత్సవంగా అంకమ్మతల్లి..**

సాయంత్రం అంకమ్మతల్లి గ్రామోత్సవంగా గ్రామ పురవీధుల్లోనికి తరలివచ్చారు. పోతురాజుల కొలుపులతో మాతంగి వేషధారిణి వాక్కుతో, కొమ్ముడప్పుల నృత్యాలు, గ్రామస్తుల కోలాట నృత్యాలు, భక్తజన సందోహం నడుమ అంకమ్మతల్లి గ్రామోత్సవం జరిగింది. అంకమ్మతల్లి ఆలయం నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం పరమేశ్వరస్వామి ఆలయం, కోదండ రామాలయం, రజక రామాలయం, శాలివాహన, రెడ్ల రామాలయాలు, అద్దంకమ్మ తల్లి, పోతురాజు మిట్ట మీదుగా సాగింది. మహిళలు అమ్మవారికి వారులు పోసి హారతులిచ్చి కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం రాత్రి గ్రామంలోని అన్ని దేవాలయాల నుంచి జలప్రసాదాన్ని సేకరించి జలాధీశం కార్యక్రమాన్ని నేత్రపర్వంగా చేశారు. జలాధీశానికి భక్తులు కూడా తమ నివాసాల నుంచి జలాన్ని సమర్పించారు.

## విశ్వాసం.. ప్రేమ.. ఈద్

- నేడు ఈద్-ఉల్-ఫిత్ర్
- ప్రత్యేక నమాజులకు ముస్తాబైన ఈద్గాలు, మసీదులు
- విందు, దాన ధర్మాలకు ప్రత్యేక ఏర్పాట్లు

లక్ష్మీపురం: నెలవంక దర్శనంతో ఈద్ సంబరాలు ఆరంభమయ్యాయి. గురువారం ఈద్-ఉల్-ఫిత్ర్ జరుపుకొనేందుకు ముస్లింలు సమాయత్తమవుతున్నారు. ఈద్గాలు ముస్తాబవుతున్నాయి. నెల రోజులపాటు కఠోర ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలు బుధవారం మగ్‌రిబ్ నమాజ్ తర్వాత నెలవంకను దర్శించారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ ముబారక్ తెలుపుకొన్నారు. రంజాన్ మాసం చివరి రోజు కావడంతో జిల్లాలోని మసీదుల వద్ద సందడి నెలకొంది. జిల్లాలో గురువారం ఈద్ ఉల్‌ఫిత్ర్ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.

**ఈద్గా వద్ద ప్రార్థన ... ప్రవక్త ఆజ్ఞ**

ప్రతి ముస్లిం రంజాన్ పండుగ రోజున ఈద్గా వద్ద ప్రత్యేక నమాజ్ చేయాలన్నది మొహమ్మద్ ప్రవక్త ఆజ్ఞ. వృద్ధులు, దివ్యాంగులు, ఈద్గా (వసతులు) లేని వారు తప్ప మిగిలిన వారంతా ఈద్గా వద్దే రంజాన్ ప్రత్యేక నమాజ్ చేయాలని మత పెద్దలు పేర్కొంటున్నారు. ఈద్గాలో సామూహిక నమాజ్‌తో ఎంతో పుణ్యం దక్కుతుందని, అంతేగాక పేద, ధనిక అనే తారతమ్యం ఉండదని, తోటి వ్యక్తుల సాధక బాధలు తెలుసుకునే అవకాశం కలుగుతుందని ఇమామ్‌లు, మౌల్వీలు చెబుతున్నారు. ఈద్గా వద్దకు వెళ్లేటప్పుడు ఒక దారిలో తిరిగి వచ్చేటప్పుడు మరో దారిలో నుంచి రావాలని ప్రవక్త సందేశం.

**తక్బీర్ తప్పనిసరి**

ముస్లింలందరూ నూతన దుస్తులు ధరించి (వారి శక్తి కొలది) ఒకచోటకు చేరి అక్కడి నుంచి తక్బీర్ చదువుతూ ఈద్గా వద్దకు చేరుకోవాలి. ఈద్గాలో ఇమామ్ ఖురాన్ వాక్యాలు, దైవ సందేశాన్ని వినిపిస్తారు. అనంతరం రంజాన్ (ఈద్ ఉల్ ఫిత్ర్) ప్రత్యేక నమాజు చదివిస్తారు. ఆ తర్వాత 'దువా'తో ప్రార్థనలు ముగుస్తాయి.

**ఈద్-ఉల్-ఫిత్ర్ సందేశమిదే..**

సర్వ మానవాళికి కారుణ్య వర్షిణి అయిన రంజాన్ మాసంలో చివరి రోజు ఈద్ ఉల్ ఫిత్ర్‌ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటారు. కఠోర దీక్ష ఆచరించిన ముస్లింలు తగిన ప్రతిఫలాన్ని అల్లాహ్ నుంచి పొందే రోజే ఈద్ ఉల్ ఫిత్ర్. రంజాన్ పండుగ స్ఫూర్తిని గుండెల నిండా నింపుకొని ఈ ఆనందంలో అందరినీ భాగస్వాములను చేసేందుకు ముస్లింలు ప్రయత్నించాలి. జకాత్, ఫిత్ర్ పేరుతో సమాజంలోని అభాగ్యులపై మన బాధ్యతను లోపరహితంగా నెరవేర్చాలి. కుల మతాలు, వర్గ విభేదాలకు అతీతంగా మంచి మనుషులుగా స్పందిస్తూ సమాజంలోని దారిద్ర్యం, పేదరికం, అసమానతలను దూరం చేయాలి. శాంతి సామరస్యాలను, సంతోషాన్ని పెంపొందింప చేయాలనేదే 'ఈద్ ఉల్ ఫిత్ర్ సమాజానికి అందిస్తున్న సందేశం.

## నగరంలో రంజాన్ సందడి



పాత్తూరువారితోట మసీదు సెంటర్‌లో కొనుగోలుదారుల సందడి



ఊపందుకున్న సేమియా కొనుగోలు

పాత గుంటూరు: రంజాన్ పర్వదినాన్ని గురువారం ఘనంగా జరుపుకొనేందుకు ముస్లింలు సన్నద్ధమయ్యారు. బుధవారంతో నెలరోజుల ఉపవాసాలు ముగిసిన నేపథ్యంలో గురువారం ఈద్-ఉల్-ఫితర్ పండగను జరుపుకొనేందుకు ముస్లింలు సన్నద్ధులయ్యారు. ఇస్లాం నిర్దేశించిన విధి విధానాల్లో ప్రధానమైన (రోజా) నెల రోజులు దీక్షలు పాటించడం, జకాత్, ఫిత్రా దానం (పేదలకు, ధార్మిక సంస్థలకు ఆర్థికసాయం) చేశామనే తృప్తితో ముస్లింలు రంజాన్ మాసానికి వీడ్కోలు చెప్పారు. రంజాన్ పండుగ నేపథ్యంలో నగరంలోని దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. పాత్తూరివారి తోటలోని మసీదు సెంటర్ సేమియా, అత్తర్, నమాజు టోపీల కొనుగోళ్లతో రద్దీగా మారింది.

- నగరంపాలెంలోని పురానీ ఈద్గాలో ఉదయం 9.30 నిమిషాలకు, పాత బస్టాండ్‌లోని ఉర్దూ పాఠశాల ఆవరణలోని ఈద్గాలో 9 గంటలకు, ఐపీడీ కాలనీ ఈద్గాలో 9.30 నిమిషాలకు, ఆంధ్రా ముస్లిం కళాశాల ఆవరణలోని ఈద్గాలో 10 గంటలకు ఈద్ నమాజ్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రత్యేక ప్రార్థనలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తాగునీటి సౌకర్యం,షామియానాలు ఏర్పాటు చేశారు.

### కళాదర్బార్ ఉగాది పురస్కారాలు ప్రదానం



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలోని అన్నమయ్య కళావేదికపై బుధవారం కళాదర్బార్ వ్యవస్థాపకుడు పాత్తూరి రంగారావు ఆధ్వర్యంలో శ్రేష్ట హాస్పిటల్ సౌజన్యంతో వివిధ రంగాలలో విశిష్ట వ్యక్తులకు క్రోధి నామ ఉగాది పురస్కార ప్రదానోత్సవ సభ నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. సభలో ముఖ్య అతిథులుగా రోటరీ మాజీ గవర్నర్ ఎ.రత్న ప్రభాకర్, డాక్టర్ ఎర్ర నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మహంకాళి సూర్యనారాయణ శర్మ శిష్య బృందం చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. అనంతరం ఉగాది పురస్కార ప్రదానోత్సవంలో చిత్ర రంగంలో శ్రీమణి, విద్యారంగంలో మద్దినేని సుధాకర్, వైద్యరంగంలో డాక్టర్ ఎం.షమా సుల్తానా, సాహిత్య రంగంలో పచ్చి పులుసు సూర్యనారాయణ, నృత్యం రంగంలో మహంకాళి నాగలక్ష్మిలకు పురస్కారాలు అందించి ఘనంగా సత్కరించారు. అనంతరం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది.


## ఎన్నికల విధుల్లో అప్రమత్తత అవసరం

నెహ్రూనగర్: ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్వో) కె.రాజ్యలక్ష్మి తెలిపారు. బుధవారం నగరంలోని ఏఎల్ బీఈడీ కళాశాలలో ఎన్నికల విధులకు ఎంపికైన సెక్టోరియల్ అధికారులు, రూట్ ఆఫీసర్లు, కమిషనింగ్, డిస్ట్రిబ్యూషన్ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ, ఎలక్షన్ కమిషన్ దేశవ్యాప్తంగా ఎన్నికలను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని, అధికారులు, సిబ్బంది విధులపై అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలన్నారు. విధుల్లో ఏ మాత్రం అశ్రద్ధ వహించినా ఎలక్షన్ కమిషన్ తీవ్రమైన చర్యలు తీసు కుంటుందని స్పష్టం చేశారు. శిక్షణ కార్యక్రమం పూర్తయిందని, మే 12న డిస్ట్రిబ్యూషన్ జరుగుతుందన్నారు. ఏఆర్‌ఓలు నిరంజన్, కుమార్, ఏఈఆర్‌ఓలు సి.హెచ్.శ్రీనివాస్, ఎన్.శ్రీనివాస్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ పద్మ, సెక్టోరియల్ అధికారులు, రూట్ ఆఫీసర్లు, ఇంజినీరింగ్, ప్రణాళిక విభాగం అధికారులు పాల్గొన్నారు.

**ఈవీఎంల వినియోగంపై శిక్షణ..**

నెహ్రూనగర్: ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు ఈవీఎంల వినియోగంపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని, అందుకు తగిన శిక్షణ అందిస్తున్నామని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) కీర్తి చేకూరి తెలిపారు. బుధవారం కమిషనర్ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి ఈవీఎంల నిర్వహణపై డెమో ఈవీఎంల ద్వారా అందిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించే ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల పని తీరుపై సెక్టోరల్, రూట్ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ శిక్షణలో మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్, సెక్టోరల్, రూట్ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

### సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి



గుంటూరు ఎడ్యుకేషన్: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తాళ్లాయపాలెం శైవ క్షేత్ర పీఠాధిపతి శివస్వామి అన్నారు. అరండల్‌పేటలోని ఆర్యవైశ్య అఫీషియల్స్-ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో బుధవారం ఉగాది పురస్కార ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శివస్వామి మాట్లాడుతూ క్రోధినామ సంవత్సరంలో ప్రతి ఒక్కరూ దైవచింతతో పాటు ఇతరులకు సహాయ పడే మనస్తత్వాన్ని కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా వ్యాపారంతో పాటు సేవా రంగంలో విశేష సేవలు అందిస్తున్న రేమాండ్స్ ఫోరూం అధినేత త్రిపురమల్లు అరుణ్‌కుమార్ దంపతులకు, సాహిత్య రంగంలో విశేష కృషి చేస్తున్న ప్రవచనకర్త కేవీ కోటేశ్వరరావుకు ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు, గుంటూరు శాఖ అధ్యక్షుడు కె.వి. బ్రహ్మం, కార్యదర్శి వెచ్చా రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి సుబ్బారావు, ఊటుకూరి నాగేశ్వరరావు, కొత్తమాసు శ్రీనివాసరావు, చింతా కృష్ణారావు పాల్గొన్నారు.

## ఇంటింటి ప్రచారానికి అనుమతులు తప్పనిసరి కాదు

- రాజకీయ పార్టీలు ఓటరు స్లిప్పులు ఇచ్చుకోవచ్చు
- ప్రత్తిపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో పి.శ్రీకర్

ప్రత్తిపాడు: ఇంటింటి ప్రచారానికి అనుమతులు తప్పనిసరి కాదని, సంబంధిత ఎస్‌హెచ్‌ఓకు సమాచారం ఇస్తే సరిపోతుందని ప్రత్తిపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి.శ్రీకర్ అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆర్వో నియోజకవర్గ స్థాయిలో రాజకీయ పార్టీల నేతలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి నుంచి ఓటు హక్కును వినియోగించుకోవాలనుకునే 85 సంవత్సరాలు నిండిన ఓటర్లు, పీడబ్ల్యూడీ ఓటర్లు ఏప్రిల్ 22వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలో 85 ఏళ్లు నిండిన వారు 1,870 మంది ఉన్నారని, పీడబ్ల్యూడీ ఓటర్లు 2,710 మంది ఉన్నారని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న వారికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు కల్పిస్తామని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న ఓటర్లు తమ ఓటు హక్కును ఖచ్చితంగా ఇంటి వద్ద నుంచే వినియోగించుకోవాలని, వారు పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు వేసుకునే అవకాశం ఉండదన్న విషయాన్ని గమనించాలన్నారు.

- అదేవిధంగా ఎన్నికలకు ఐదు రోజుల ముందు నుంచి బీఎల్‌ఓలతో ఎన్నికల సంఘం ఓటర్లకు ఓటరు స్లిప్పులు అందజేస్తుందని తెలిపారు. రాజకీయ పార్టీలు కూడా తమ బీఎల్ఏ ద్వారా పార్టీ గుర్తులు, పార్టీ రంగులు లేకుండా ఓటరు స్లిప్పులను పోలింగ్ కేంద్రాలకు రెండు వందల మీటర్లు అవతల పంపిణీ చేసుకోవచ్చని చెప్పారు.
- రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచార సమయాన్ని కచ్చితంగా పాటించాలని, ప్రచార వాహనాల నిబంధనల విషయంలోనూ రూల్స్ ఫాలో అవ్వాలని, లేదంటే చర్యలు ఉంటాయని ఆర్వో స్పష్టం చేశారు.
- ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ఎలాంటి ఉచితాలూ పంపిణీ చేయడానికి వీల్లేదని, అయినప్పటికీ తాగునీటికి సంబంధించి అనుమతి కోసం దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సమావేశంలో రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బ్లేడుతో భార్య గొంతు కోసిన భర్త



పెదకాకాని: కోర్టు పరిధిలో ఉన్న కేసును ఉపసంహరించుకోలేదనే కోపంతో భర్త బ్లేడుతో భార్య గొంతు కోసిన సంఘటన పెదకాకానిలో చోటు చేసుకుంది. పెదకాకాని వెంగళరావునగర్ ప్రాంతానికి చెందిన సయ్యద్ షామీర్ అదే ప్రాంతానికి చెందిన తస్లీమ్‌ను ఏడాదిన్నర కిందట ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి సంవత్సరం వయసున్న బాబు ఉన్నాడు. వివాహమైన కొద్ది రోజులకే షామీర్ వేధింపులు భరించలేని భార్య పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు గృహహింస, వరకట్నం వేధింపులపై కేసు నమోదు చేశారు. ఆ కేసు ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉంది. ప్రస్తుతం ఇద్దరూ పుట్టింటికీ, అత్తంటికీ దూరంగా ఇల్లు అద్దెకు తీసుకుని జీవనం సాగిస్తున్నారు. షామీర్ తరచూ భార్యను కేసు ఉప సంహరించుకోవాలని ఒత్తిడి తెస్తున్నాడు. కేసు ఉప సంహరించుకుంటే గతంలో మాదిరిగా వేధింపులకు గురిచేస్తాడని ఆమె అందుకు నిరాకరించింది. దీంతో కోపోద్రిక్తుడైన షామీర్ బుధవారం ఒక పథకం ప్రకారం బ్లేడుతో భార్య గొంతు కోశాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం రక్తస్రావం అవుతున్న తస్లీమ్‌ను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితుడు సయ్యద్ షామీర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ కె.వీరాస్వామి తెలిపారు.

## నేటి నుంచి సువార్త ఉజ్జీవ మహాసభలు

గుంటూరు రూరల్: ప్రపంచ శాంతి కోసం క్రీస్తుని నామాన్ని ఘనపరుస్తూ ప్రతి ఏటా కృపా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహించే 18వ వార్షిక సువార్త ఉజ్జీవ మహాసభలు ఈనెల 11వ తేదీనుంచి ప్రారంభించనున్నట్లు కృపా మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రదర్ మాథ్యూస్ తెలిపారు. బుధవారం నల్లపాడు రోడ్డు హౌసింగ్ బోర్డ్ కాలనీ ఎదురుగా గల మహాసభల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ గురువారం సాయంత్రం నుంచి ప్రారంభమై 12, 13, 14వ తేదీ ఆదివారం రాత్రి వరకూ ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయన్నారు. నాలుగు రోజులపాటు నిర్వహించే ఈ ప్రత్యేక ప్రార్థనల్లో దేశవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు పాల్గొంటారని చెప్పారు. అందుకు తగిన ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొనే విశ్వాసులకు భోజనం, వసతి ఏర్పాట్లు సిద్ధం చేశారన్నారు. రాత్రి ప్రత్యేక ప్రార్థనలకు, పగటిపూట ప్రత్యేక ప్రార్థనలకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. పగటి పూట ప్రార్థనలకు ప్రత్యేకంగా చలువ పందిళ్ళు, తాగు నీరు, వసతి, భోజనం, స్నానపు గదులు ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా నిర్వహించే దేశ, రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో క్రీస్తు స్తుతిగీతాల ఆలాపనలు, పాటల సీడీల ఆవిష్కరణ జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో కృపా మినిస్ట్రీస్ సీనియర్ పాస్టర్ డేవిడ్ రాజు, బ్రదర్ హోసన్న, పాస్టర్లు తిమోతి, మోషే తదితరులు పాల్గొన్నారు.

### వ్యక్తి ఆత్మహత్యాయత్నం

తెనాలిరూరల్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు కేసు నమోదు చేస్తారన్న భయంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాలిలా ఉన్నాయి. తెనాలి మండలం కోపల్లె గుడివాడకు చెందిన ఏసోబు, చలపతి మంగళవారం రాత్రి కొలకలూరులోని వైన్ షాపులో ఆరు మద్యం సీసాలు తీసుకున్నారు. గ్రామానికి వెళుతుండగా ఎస్ఈబీ అధికారులు వీరి వద్ద మద్యం సీసాలు గుర్తించారు. ఏసోబు గతంలో అక్రమ మద్యం విక్రయం కేసులో నిందితుడిగా ఉండడంతో అతని మోపెడ్‌ను ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకుని బైండోవర్ చేసేందుకు బుధవారం ఉదయం కార్యాలయానికి రావాలని సూచించారు. దీంతో కేసు నమోదు చేస్తారన్న అనుమానంతో ఏసోబు కార్యాలయానికి వెళ్లి తాను పురుగుల మందు తాగినట్టు సిబ్బందికి చెప్పడంతో హుటాహుటిన వారు తెనాలి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను వన్‌టౌన్ పోలీసులు రికార్డు చేశారు. అయితే తన భార్యతో ఘర్షణ జరుగగా పురుగుల మందు తాగినట్టు కూడా ఏసోబు చెబుతున్నాడని పోలీసులు తెలిపారు. విచారించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.








సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ప్రత్తిపాడు డివిజన్
90109 57733 (ప్రత్తిపాడు)
90109 62225 (పొన్నూరు)
Office mail : sakshigntadvt@gmail.com